# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

# ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ ప్రసారార్థం:

తేది : 19.07.2015
విజయవాడ

## చిత్తూరు జిల్లాలో ప్రబలిన డెంగ్యూ, విష జ్వరాల నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.
## - సిపియం

రాష్ట్రంలో వర్షాకాలంలో వచ్చే విషజ్వరాలపట్ల వైద్య, ఆరోగ్యశాఖలు అప్రమత్తంగా లేవని అర్థం అవుతున్నది. అనేక జిల్లాల్లో జ్వరాల కేసులు తీవ్రంగా పెరుగుతున్నా జిల్లాల్లోని వైద్యశాఖలు దానికి తగినట్లు ఏమాత్రం స్పందించడం లేదు. ప్రత్యేకించి చిత్తూరు జిల్లాలో డెంగ్యూ జ్వరాల పరిస్థితి చాలా ఆందోళనకరంగా వున్నది. ప్రభుత్వం తక్షణమే తీసుకోవాలని సిపియం రాష్ట్ర ఆరోగ్య కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

చిత్తూరు డి.ఎం.హెచ్.వో జూలై 16వ తేదిన ఇచ్చిన పత్రికా ప్రకటన ప్రకారం మదనపల్లి డివిజన్‌లో సి.టి.యం చౌడిపల్లి, తంబళ్ళపల్లి, పెద్దమండ్యం, రామిసముద్రం, పుంగనూరులలో 117 డెగ్యూ కేసులు నమోదయ్యాయని, 126 గ్రామాల్లో వ్యాధి లక్షణాలున్నాయని తెలిపారు. సుమారు 700 విషజ్వరం కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ కేసులు డి.ఎం.హెచ్.వో చెప్పిన దానికి రెట్టింపువున్నాయని గత సంవత్సరంతో పోలిస్తే రెండున్నర రెట్లుగా వున్నాయని, ఐదుగురు డెంగ్యూవల్ల చనిపోయినట్లు అనధికార వార్తలు తెలియజేస్తున్నాయి. ఇటీవల టైపాయిడ్ కేసులు 190 నమోదయినట్లు అధికారులు తెలిపారు. మదనపల్లి ప్రాంతం నుంచి బెంగుళూరుకు, చిత్తూరు ప్రాంతం నుండి తమిళనాడులోని క్రిష్టియన్ మెడికల్ కాలేజి(సి.యం.సి)కి డెంగ్యూ జ్వరాల వైద్యం కోసం వెళ్ళి లక్షలు ఖర్చు పెట్టుకోవలసి వస్తున్నదని తెలిసింది. ఇటీవల మదనపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌లో చనిపోయిన శ్యామల అనే బాలిక తల్లిదండ్రులు, డెంగ్యూ వ్యాధికి గురైన తమ బిడ్డకు సరైన వైద్యం అందనందువల్ల మరణించిందని తమదుఖాన్ని వెళ్ళగక్కారు. చిత్తూరు డివిజన్‌లోని జి.డి నెల్లూరు మండలం, వరకనెల్లూరు పంచాయితీ పేటనీత్తం గ్రామంకు చెందిన గాలి హనుమంతరావు కుమార్తెలిద్దరికి డెంగ్యూ జ్వరం రావడం వల్ల సి.యం.సి వైద్యశాలలో ఒకటిన్నర లక్షలు ఖర్చు పెట్టారు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు డెంగ్యూవ్యాధితో ఇంకా సి.యం.సి ఇన్‌టెన్సివ్ కేర్‌లో చికిత్స పొందుతున్నారు.

డెంగ్యూ చిత్తూరుజిల్లాలో తీవ్రంగా వ్యాపిస్తున్నట్లు స్పష్టంగా అర్థం అవుతున్నది. దీనిని నివారంచే చర్యలు చేపట్టడంలో రాష్ట్ర, జిల్లా ఆరోగ్యశాఖ తగిన చర్యలు ఇప్పటి వరకు తీసుకోలేక పోయింది. అంటువ్యాధులను నివారించే చర్యలు చేపట్టినా, నివారించడానికి కొంత సమయం పడుతుంది. జూలై 16వరకు చిత్తూరు జిల్లా వైద్య అధికారులు కనీసం వ్యాధులు ప్రబలిన ప్రాంతాలను పర్యటించకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియచేస్తున్నది. ముఖ్యమంత్రి, సంబంధిత ఆరోగ్యశాఖ మంత్రులు రాజధాని చుట్టూ తిరుగుతూ రాష్ట్రాన్ని గాలికి వదిలేస్తున్నారు. పేదల జీవితాలు గాలిలో కలిసిపోతున్నాయి. ముఖ్యమంత్రి జిల్లాలోనే ఇట్లుంటే మిగిలిన జిల్లాల్లో ఏలా వుంటుందో ఊహించుకోవచ్చు. తక్షణమే ఆరోగ్య శాఖామంత్రి, రాష్ట్ర, జిల్లా వైద్య అధికారులు చిత్తూరు జిల్లాలో పర్యటించి జ్వరాలను అరికట్టే చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది.

చిత్తూరు జిల్లాలో డెంగ్యూవ్యాధి తీవ్రంగా ప్రబలడానికి ప్రధాన కారణాలను సోషల్ & ప్రివెంటివ్ మెడిసెన్ డిపార్టుమెంట్ ద్వారా, వైరాలజీ నిపుణుల ద్వారా పరిశోధనలు జరిపించాలని కోరుతున్నాం. డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాపించిన అన్ని గ్రామాల్లో వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర వైద్యాన్ని అందించాలి. ఇప్పటికే వ్యాధి సోకినవారికి చిత్తూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయాలి. ప్లేట్‌లెట్స్ పడిపోయే డెంగ్యూ రోగులకు తగిన రక్తాన్ని జిల్లా బ్లడ్‌బ్యాంక్‌లో నిలువవుంచే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇతరులకు అంటువ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.

సిపియం రాష్ట్ర ఆరోగ్య కమిటీ
విజయవాడ